క్లుప్తంగా

హెచ్ఐవీపై అవగాహన అవసరం

శ్రీకాకుళం: హెచ్ఐవీపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని దిశా(జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం) క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కేవీఆర్ శైలజ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో హెచ్ఐవీపై అవగాహన, మాదకద్రవ్యాల నివారణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా సోమవారం శ్రీకాకుళం సిద్దార్థ పారా మెడికల్ కళాశాలలో నిర్వహించిన ఇంటెన్సిఫైడ్ ఐఈసీ(ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్) శిబిరంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ సోకే మార్గాలు, వ్యాధి స్థితిగతులు వివరించి, సుఖవ్యాధుల నివారణ, మాదకద్రవ్యాల వినియోగం తగ్గించుకోవడంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఆర్టీ డేటా మేనేజర్ తారకేశ్వరరావు, పీపీటీసీటీ, డీఎస్ఆర్సీ కౌన్సిలర్లు శైలజ, శ్రీనివాస్, విహాన్, పీవో రాంప్రసాద్, వైద్యుడు డాక్టర్ కె.చక్రవర్తి పాల్గొన్నారు.

జేవీవీ రాష్ట్ర సభలు విజయవంతం


జన విజ్ఞాన వేదిక మహాసభలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: సెప్టెంబర్ 13, 14 తేదీల్లో విజయనగరంలో జరిగిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు విజయవంతమయ్యాయని జేవీవీ ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాకు చెందిన గొంటి గిరిధర్ రాష్ట్ర కార్యదర్శిగా, కుప్పిలి కామేశ్వరరావు రాష్ట్ర కమిటీ సభ్యునిగా, ఎస్.సాయి శ్రీనివాసశర్మ చెకుముకి రాష్ట్ర సబ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా నుంచి ఎం.వాగ్దేవి, పి.కుర్మారావు, వీఎస్ కుమార్, ఆర్.సురేష్ బాబు, ఎ.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ విస్తృత స్థాయి సమావేశం నేడు

శ్రీకాకుళం (పీఎన్కాలనీ): వైఎస్సార్సీపీ శ్రీకాకుళం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం నియోజకవర్గం ఆ పార్టీ కార్యాలయం నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. పార్టీ రైతు, బీసీ అనుబంధ విభాగాల వివిధ హోదాల్లో బాధ్యతలు స్వీకరించిన సభ్యులకు సత్కార కార్యక్రమం జరుగునని వెల్లడించారు.

ఉపాధ్యాయుల నిరసన


తహసీల్దార్కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం రూరల్: ఏపీటీఎఫ్ తలపెట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలను పరిష్కరించాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు సోమవారం ధర్నా నిర్వహించారు. పీఆర్సీ, డీఏలను మంజూరు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మోమో నంబర్-57 రద్దు చేసి, పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ గణపతిరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు చావలి శ్రీనివాస్, సదాశివుని శంకరావు, జనసాహితీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మోహన్రావు, ప్రధాన కార్యదర్శి చిట్టి త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత హోంగార్డుకు సత్కారం


హోంగార్డు తిరుపతిరావును సత్కరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు జి.తిరుపతిరావును సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఘనంగా సత్కరించారు. జ్ఞాపికను, సర్వీసు ప్రశంసాపత్రాన్ని అందించి, తక్షణ సాయం కింద రూ.5 వేల నగదు చెక్కును అందజేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

జి.సిగడాం: గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ మహాదేవు సరిత, ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామాల్లో నెలకున్న చిన్న, చిన్న భూ సమస్యలను పరిష్కారం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో అంటురోగాలు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, ఐసీడీఎస్ సూపర్వైజర్ తమ్మినేని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయి సాగు.. బాగు.. బాగు

- తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు
- ఎచ్చెర్ల నియోజకవర్గంలో 250 ఎకరాల్లో సాగు


బొప్పాయి పంట

ఎచ్చెర్ల: ఆరోగ్య జాగ్రత్తల్లో భాగంగా ప్రతి ఒక్కరూ తీసుకునే పండ్లలో బొప్పాయిది ప్రథమ స్థానం. మనిషిలో రక్తాన్ని శుద్ధిచేసే గొప్పగుణం బొప్పాయికి ఉంటుంది. అలాంటి బొప్పాయి పంటకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. దీంతో ఎచ్చెర్ల నియోజకవర్గంలో రైతులు బొప్పాయి సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. క్రమంగా ఈ పంట సాగు విస్తీర్ణం పెరుగుతోంది. బొప్పాయి సాగుపై ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు సూచనలు అందిస్తున్నారు. బొప్పాయి సాగుకు గత ప్రభుత్వంలో అందించిన రాయితీలు, ప్రోత్సాహకాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో 250 ఎకరాల్లో బొప్పాయి సాగు చేస్తున్నారు. లావేరులో 80, జి.సిగడాంలో 50, రణస్థలంలో 70, ఎచ్చెర్లలో 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. స్థానిక వ్యాపారులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారులు పొలాల వద్దకే వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు పంట రవాణా ఖర్చుకూడా తగ్గుతోంది.

సస్యరక్షణ చర్యలు కీలకం

బొప్పాయి సాగులో రైతులు మంచి లాభాలు అర్జించవచ్చని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. అధికారుల సూచనలు పాటిస్తూ సస్యరక్షణ చర్యలు చేపడితే ఎకరానికి 60 టన్నుల వరకు పంట దిగుబడి వస్తుందని పేర్కొంటున్నారు. ఎకరా సాగుకు రూ.70 వేల వరకు ఖర్చు అవుతుందని, పంట దిగుబడి బాగుంటే రూ.3 లక్షల వరకు ఆదాయం పొందవచ్చని చెబుతున్నారు. బొప్పాయి సాగుకు హెక్టారుకు రూ.18,500లు రాయితీగా ప్రభుత్వం అందజేస్తోంది. ఈ రాయితీ కోసం రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుని విత్తనాలు, ఎరువులు, స్ప్రేయింగ్ కెమికల్స్ బిల్లులు, పంట ఫొటో జత చేయాల్సి ఉంటుంది. అలాగే పంట సాగులో మల్చింగ్ కోసం మొక్క చుట్టూ మట్టిని కప్పి ఉంచడానికి పాలిథిన్ ఫిల్మ్ కప్పాల్సి ఉంటుంది. దీంతో మొక్క వృద్ధి చెందుతుంది. దీనికోసం హెక్టారుకు రూ.16 వేలు అందించనున్నారు. అలాగే మైక్రో ఇరిగేషన్లో భాగంగా డ్రిప్ పరికరాలు కావాల్సిన రైతులకు హెక్టారుకు రూ.80 వేల విలువైన పరికరాలను రాయితీపై అందిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

బొప్పాయి సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. హెక్టారుకు రూ.18,500 సాగు ప్రోత్సాహంతో పాటు మల్చింగ్ కోసం రూ.16 వేలు అందజేస్తున్నారు. డ్రిప్ కోసం హెక్టారుకు రూ.80 వేల వరకు రాయితీ కల్పిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు అర్జించే బొప్పాయి సాగుపై రైతులు దృష్టి సారించాలని అవగాహన కల్పిస్తున్నాం.

– సుదర్శిని, ఉద్యానవన శాఖాధికారి, ఎచ్చెర్ల

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కమిషనర్ ప్రసాద్కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్కాలనీ): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ గౌరవాధ్యక్షుడు ఆర్.ప్రకాశరావులు కోరారు. ఈ మేరకు కార్మికులతో కలిసి శ్రీకాకుళం నగర కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్కు వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీ నియమించి, మున్సిపల్ కార్మికులందరికీ జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే సమ్మె కాలపు జీతాలు చెల్లించేందుకు జీవో జారీ చేయాలని కోరారు. బదిలీ, కోవిడ్ కార్మికులను ఆప్కాస్లో చేర్చాలని, నెలంతా పని కల్పించాలని, ఖాళీల భర్తీలో వీరికి ప్రథమ ప్రాధాన్యతనివ్వాలన్నారు. 2016లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని విన్నవించారు. గ్రాట్యూటీ చెల్లింపు, వయోపరిమితి 62 ఏళ్లకు పెంపు, సిక్, డెత్, రిటైర్మెంట్ అయిన వారి స్థానాల్లో పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.గణేష్, ఎన్.బలరాం, కమిటీ సభ్యులు ఎ.శంకర్, ఎ.రాము, డి.యుగంధర్, ఎ.జనా, ఎ.జ్యోతిప్రసాద్, డి.లక్ష్మి, పి.మల్లమ్మ, కె.గణేష్, జె.బుజ్జేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

23 మంది ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

ఎచ్చెర్ల: స్థానిక శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు 23 మంది హైదరాబాద్లోని స్రింటమ్ ప్రైవేటు టెక్నాలజీ కంపెనీలో ఉద్యోగాలు పొందారని కళాశాల ప్రతినిధులు దుర్గాప్రసాద్రాజు, సాయినాథ్రెడ్డి తదితరులు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో విద్యార్థులను సోమవారం అభినందించారు. కార్యక్రమంలో శివానీ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

జి.సిగడాం: మండలంలోని బాతువ గ్రామంలో ఈనెల 8వ తేదీన కురిసిన భారీ వర్షానికి మొక్కజొన్న పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. దీంతో సుమారు 70 ఎకరాల్లో పంట నేలకొరిగింది. అందువలన అధికారులు స్పందించి తక్షణమే రైతులను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు బూటు అప్పారావు, తదితరులు కోరుతున్నారు.

పరామర్శలు


జి.సిగడాం: అప్పారావును పరామర్శిస్తున్న కిరణ్కుమార్


శ్రీకాకుళం రూరల్: ఎల్లమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ధర్మాన

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని చాపురం పంచాయతీ సిద్ధిపేట గ్రామానికి చెందిన ముక్కు ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు పార్టీ సీనియర్ నాయకులు అల్లు లక్ష్మీనారాయణ, ముక్కు అఖిల్, మౌళి తదితరులు ఉన్నారు.

జి.సిగడా: మండలంలోని కప్పరాం గ్రామానికి చెందిన పలిశెట్టి అప్పారావు అనారోగ్యంతో బాధపడుతున్నారని సమాచారం తెలుసుకుని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్కుమార్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జిల్లా అధికార ప్రతినిధి పిల్లల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు తిరుమలరెడ్డి లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ యర్రాబోలు సింహాచలం, ఆకుల శ్రీనివాసరావు, విశ్రాంత వీఆర్వో నల్లి ఆదినారాయణ, నాయకులు జనపాల ధనుంజయరావు, తూట అప్పలరాజు, పకీరు, అన్నారావు, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

హిందీతో సమైక్యతాభావం


జి.సిగడాం: భాగ్యశ్రీని సత్కరిస్తున్న సిబ్బంది


శ్రీకాకుళం న్యూకాలనీ: మాట్లాడుతున్న వెంకట్ ఉజ్వల్

శ్రీకాకుళం న్యూకాలనీ: హిందీ భాషతో దేశంలో సమైక్యతాభావం మరింతగా పెరుగుతుందని మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ అభిప్రాయపడ్డారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల హిందీ విభాగం, భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో హిందీ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ.. ఒకే దేశం ఒకే భాష నానుడి హిందీ ద్వారా సాధ్యమన్నారు. హిందీ విభాగాధిపతి డాక్టర్ ఆర్.శ్రీనివాస్పాత్రో వార్షిక నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో సెట్శ్రీ సీఈవో వీవీ అప్పలనాయుడు, కెప్టెన్ వై.పోలినాయుడు, ఎంవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: హిందీ భాష అనేది జాతీయ సమైక్యతకు దోహదపడే భాష అని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డి.గణేష్ పట్నాయక్ అన్నారు. సోమవారం విద్యాలయంలో జాతీయ హిందీ పక్షోత్సవాలు పురస్కరించుకొని హిందీ ఉపాధ్యాయురాలు ఎస్.భాగ్యశ్రీని సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోట తిరుపతిరావు, ఎస్.రవి కుమార్, ఎస్.సుబ్రహ్మణ్యం, పిచ్చిక నేతాజీ, ముత్యాలరావు, అరుణకుమారి, నాగమణి, ప్రమీల, జ్యోత్స్న, నరసయ్య, ఆదినారాయణ, జగదేష్, దుర్గారావు, ధనలక్ష్మి, సతీష్, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బలభద్రుని రాజా అభినందించారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో 11వ ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్జిల్లాల) అండర్-17 బాలబాలికల ఫెన్సింగ్ ఛాంపియన్షిప్-2025 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బాలికల విభాగంలో ఇప్పీ కేటగిరి నుంచి డి.జోషిణి, టి.రోషిత, బి.బాలారాణి, సాబర్ కేటగిరి నుంచి ఆమని, కవిత, తనూజా, శ్రీసాత్విక కాంస్య పతకాలు సాధించారు. స్పోర్ట్స్ మీట్ ముగించుకుని జిల్లాకు చేరుకున్న క్రీడాకారులను నగరంలోని టౌన్ హాల్లోని స్కూల్ ఆఫ్ ఫెన్సింగ్ కేంద్రంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బలభద్రుని రాజా ఇతర ప్రతినిధులు అభినందించారు. వీరిని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న కోచ్లు హేమంత్ఖాన్, రాహుల్ను ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు డి.భవానీ, యశోద, అనితశ్రీ, పుష్పలత, భాగ్య, తులసి, రాములమ్మ, అసోసియేషన్ కోచ్లు జోగిపాటి వంశీ, హేమంత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జయంతి


తులసీమాలలు, పూల అలంకరణలో వేంకటేశ్వరస్వామి


బ్యాంకర్స్ కాలనీలో ఊయల ఉత్సవం


నారాయణ తిరుమలలో వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు వైష్ణవ దేవాలయాల్లో శ్రీకృష్ణ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. నారాయణ తిరుమల కొండపై వేంచేసిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసు ఆధ్వర్యంలో స్వామి విశ్వరూప దర్శనం, అష్టోత్తర శత కలశాభిషేకం, వజ్రకవచ దర్శనం నిర్వహించారు. పిదప మహా మండపంలో స్వామివారిని ఊయలలో ఉంచి ఊయల ఉత్సవం నిర్వహించారు. అలాగే చల్లకం బాల ఉత్సవం (ఉట్ల పండుగ) వేడుకగా జరిపారు. అదేవిధంగా కోదండ రామాలయంలో శ్రీకృష్ణ జనన ఘట్ట పారాయణ, సాలిగ్రామ అభిషేకం, ఊంజల సేవ, అర్చనలు అర్చకులు బంకుల్లి శేషాచార్యులు నిర్వహించారు. బ్యాంకర్స్ కాలనీలోని శివబాలాజీ ఆలయంలో అర్చకులు గోపి నంబాళ్ల సీతారామాచార్యులు ఆధ్వర్యంలో 21 ప్రసాదాల నైవేద్యం చేశారు. నానుబాలవీధిలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. డీసీసీబీ కాలనీలోని భూ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు గోపాలాచార్యులు 36 రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు.


కోదండ రామాలయంలో శ్రీకృష్ణ పూజలు

ఆదర్శనీయుడు మోక్షగుండం



శ్రీకాకుళం (పీఎన్కాలనీ): మోక్షగుండం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇంజినీర్లు

నేటి యువత, ఇంజినీర్లకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శనీయుడని వక్తలు అన్నారు. ఆయన జయంతి పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఇంజినీర్ల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఇంజినీర్లు నిర్మించే ప్రతి కట్టడం భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. అలాగే పలువురు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్వర్క్


శ్రీకాకుళం అర్బన్: గాంధీ స్మృతివనంలో మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు


ఎచ్చెర్ల: నివాళులర్పిస్తున్న ట్రిపుల్ ఐటీ సిబ్బంది


శ్రీకాకుళం రూరల్: మోక్షగుండం జయంతి పురస్కరించుకొని మానసిక దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న దృశ్యం


ఎచ్చెర్ల: శివానీలో ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రాజెక్టుల ప్రదర్శన

25న పాటల పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: దివంగత గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం ఐదో వర్ధంతి పురస్కరించుకొని పిల్లలకు, పెద్దలకు వేర్వేరుగా పాటల పోటీలు నిర్వహించనున్నట్లు సంఘ సేవకుడు సోడవరం ఈశ్వరరరావు, సాహితీ చైతన్య కిరణాల వ్యవస్థాపకుడు బి.ఉమామహేశ్వరరావులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. 94410 95731, 85559 74804 నంబర్లకు కాల్చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

విగ్రహాలు ఏర్పాటు చేయాలి

శ్రీకాకుళం కల్చరల్: అమరావతిలో హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో 100 మంది తెలుగు వీరుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు కోట వేంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. నవ్యాంధ్ర సాంస్కృతిక చైతన్య కళాయాత్రను శ్రీకాకుళం నుంచి శ్రీకారం చుట్టారు. స్థానిక బాపూజీ కళా మందిర్ వద్ద ఉన్న ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి సోమవారం యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రసిద్ధ గాయకులు ఘంటసాల, సినీ నటులు ఎన్టీఆర్, ఏఎన్ఆర్కు భారతరత్న ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రెడ్క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఆర్అండ్బీ ఎస్ఈ పి.సత్యనారాయణ, ఆర్అండ్బీ డీఈఈ రవికాంత్, ఈఈ తిరుపతిరావు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరం


శస్త్ర చికిత్సకు వెళ్తున్న దృశ్యం

రణస్థలం: మండల కేంద్రంలోని సూర్య ఆస్పత్రి ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఇడదాసుల విద్యా ఆరోగ్య ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా రోగులు 109 మందికి పరీక్షలు నిర్వహించగా.. 43 మందికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించడంతో వారిని శంకర్ ఫౌండేషన్ బస్సులో విశాఖపట్నం తరలించారు. మిగిలిన వారికి వైద్యులు అద్దాలు సూచించారు. శిబిరంలో డాక్టర్ యశ్వంత్, సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఇడదాసుల తిరుపతిరాజు, ప్రభుత్వ అప్తాల్మిక్ అసిస్టెంట్ చంద్రశేఖర్, సేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

20న న్యాయ సదస్సు


మాట్లాడుతున్న హనుమంతు లజపతిరాయ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజ్యాంగ విలువలు, మూలాలు రామాయణంలో అనే అంశంపై ఈనెల 20వ తేదీన విజయనగరం సమీపంలోని రామనారాయణం ఆలయం ఆవరణలో న్యాయ సదస్సు నిర్వహించనున్నట్లు వాల్మీకి పరిశోధన కేంద్రం సంచాలకుడు ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ తెలిపారు. ఈ సదస్సును వాల్మీకి పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సోమవారం శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరించారు. సదస్సుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సదస్సు ఉదయం 9 గంటలకు ప్రారంభమై, సాయంత్రం వరకు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, బార్ ప్రతినిధులు పాల్గొన్నారు.